క్లుప్తంగా...

నేటి నుంచి సాలార్‌జంగ్ మ్యూజియంలో సమ్మర్ క్యాంప్

చార్మినార్: సాలర్‌జంగ్ మ్యూజియంలో సోమవారం నుంచి 17వ తేదీ వరకు బాలబాలికలకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్–2023 నిర్వహిస్తున్నట్లు సాలార్‌జంగ్ మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ నాగేందర్‌రెడ్డి తెలిపారు. 8–11 ఏళ్ల వయస్సున్న వారు జూనియర్ బ్యాచ్‌గాను, 12–15 ఏళ్ల వయస్సున్న వారు సీనియర్ బ్యాచ్‌గాను కొనసాగే ఈ సమ్మర్ ఆర్ట్ క్యాంప్‌లో యోగా, ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఇండియన్ ఆర్ట్, హెరిటేజ్ అవేర్‌నెస్, మ్యూజియం అవేర్‌నెస్, డ్రాయింగ్, పేయింటింగ్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, క్లేమోడల్స్(3డి) తదితర కార్యక్రమాలుంటాయన్నారు.

నూతన కార్యవర్గం



నాంపల్లి: హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ నూతన కార్యవర్గం మూడవసారి ఏకగ్రీంగా ఎన్నికైంది. ఈ మేరకు ఆదివారం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా ఎం.వి.రమణారెడ్డి, ఉపాధ్యక్షులుగా డి.అనంతయ్య, అజితా సురభి, కార్యదర్శులుగా జె.వెంకటేశ్వర్లు, ఎస్.కాంతారెడ్డి, గుర్రం మల్లేశం, కోశాధికారిగా రాజేందర్ నాగుల్ల, కార్యవర్గ సభ్యులుగా అప్పం రాఘవేంద్ర, కప్పరి కిషన్, కంది నర్సింహులు, రమేష్ కుమార్ గాంగ్జీ, సంపత్‌రెడ్డి, బాలరాజ్, అన్నారపు నరేందర్, సత్య గన్నోజీ, మహేష్ పొట్టబత్తిని ఎన్నికయ్యారు.

భక్తిశ్రద్ధలతో వాసవి మాత జయంతి



పూజా కార్యక్రమాలలో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

గౌలిపురా: వాసవి మాత జయంతి సందర్భంగా గౌలిపురా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కన్యకాపరమేశ్వరీ ట్రస్ట్ భవన్‌లో ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం మండపారాదన, అమ్మవారికి పంచామృతాభిషేకం, సామూహిక కుంకుమార్చన, మహా నైవేద్యం పూజా కార్యక్రమాలు కొనసాగాయి. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శ్రీధర మల్లికార్జున్, ప్రతినిధులు నర్సింహులు, శ్రీరాం కోటయ్య, చీల రాములు, సరాబు విశ్వేశ్వరయ్య, అశోక్‌కుమార్ వెంకటేష్, సంతోష్, నర్సింహులు, బిక్షపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాలలు ఐక్యంగా ఉండాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న చెరుకు రాంచందర్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మాలలు ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఎంతగానో ఉందని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రామ్‌చందర్ అన్నారు. ఆదివారం గన్‌ఫౌండ్రీలోని సూర్యలోగ్ కాంప్లెక్స్‌లో జేఏసీ నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కొన్ని రాజకీయ పార్టీలు వర్గీకరణకు అనుకూలంగా మాట్లాడుతున్నాయని, రాబోయే రోజుల్లో వారికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. జేఏసీ వైస్ చైర్మన్‌లుగా తాళ్లపల్లి రవి, కె.గిరిధర్ మాల, కన్వీనర్లుగా నల్లాల కనకరాజు, పిల్లి సుధాకర్, కావలి అనంతరాములు, లీగల్ సలహాదారులుగా కొత్త పద్మారావు, రత్నం, గౌరవ సలహాదారులుగా బాలకృష్ణ, రావుల అంజయ్య తదితరులను ఎన్నుకున్నారు.

పైలాన్‌కు మరమ్మతులు చేయాలి



పైలాన్ వద్ద కాంగ్రెస్ నాయకుడు కృష్ణ తదితరులు

గోల్కొండ: నానల్‌నగర్ చౌరస్తా వద్ద గల స్వాతంత్ర్య సమరయోధులతో నిర్మించిన పైలాన్‌కు వెంటనే మరమ్మతులు చేయాలని కాంగ్రెస్ కార్వాన్ బీ బ్లాక్ అధ్యక్షుడు కురకుల కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన నానల్‌నగర్ చౌరస్తా వద్ద గల స్వాతంత్ర సమరయోధుల పేర్లతో నిర్మించిన చేయి గుర్తుతో ఉన్న పైలాన్‌ను సందర్శించారు. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రభుత్వం దీనిని నిర్వహణను గాలికి వదిలేసిందని ఆయన ఆరోపించారు. ఈ పైలాన్ కింది ప్లాట్‌పాం మొత్తం దిబ్బతిందన్నారు. వెంటనే దీనికి మరమ్మతులు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్, రామ్‌కుమార్, ప్రేమ్ కిషోర్ తదితరులున్నారు.


సందడే.. సందడి

పాతబస్తీ పర్యాటక స్థలాల్లో పెరిగిన సందర్శకుల సంఖ్య

- మండే ఎండల్లో సైతం తగ్గని పర్యాటకుల రద్దీ
- వీకెండ్‌లో పాతబస్తీకి ఎక్కువగా సందర్శకుల తాకిడి



సాలార్‌జంగ్ మ్యూజియం



చార్మినార్ కట్టడం వద్ద సందర్శకుల కిటకిట

చార్మినార్: ప్రపంచ పర్యాటక ప్రాంతమైన పాతబస్తీలో పర్యాటకుల రద్దీ పెరిగింది. తద్వారా ఆదాయం కూడా పెరిగింది. మండే ఎండలను సైతం లెక్కచేయని పర్యాటకులు పాతబస్తీలోని చార్మినార్, మక్కా మసీదులతో పాటు సాలార్‌జంగ్ మ్యూజియం, హెచ్‌ఈహెచ్ నిజాం మ్యూజియం, చౌమహల్లా ప్యాలెస్ మ్యూజియాలను సందర్శించడానికి ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. ఓవైపు ఎండలు మండిపోతున్నా.. సందర్శకుల రద్దీ ఎక్కువగానే ఉంది. వీకెండ్‌లో సందర్శకుల సంఖ్య మరీ రెట్టింపు అవుతుంది. దీంతో పాతనగరంలోని పర్యాటక ప్రాంతాల వద్ద స్థానిక వ్యాపారులకు సైతం గిరాకీ పెరిగింది.

సాలార్‌జంగ్ మ్యూజియం..

దారుషిఫా చౌరస్తాకు సమీపంలో మూసీనది పక్కన 1968లో నూతనంగా నిర్మించిన భవనంలోకి సాలార్‌జంగ్ మ్యూజియాన్ని మార్చారు. అంతకుముందు సాలార్‌జంగ్ మ్యూజియం దివాన్‌దేవుడీలో కొనసాగింది. 1, 2, 3 సాలార్‌జంగ్‌లు భారతదేశంతో పాటు విదేశాల నుంచి సేకరించిన దాదాపు 48 వేల కళాఖండాలను మ్యూజియంలో పొందుపరిచారు. రెబేకా(పాలరాతి ముసుగు సుందరి) గంటలు కొట్టే గడియారంలతో పాటు చైనా, జపానీస్, యూరోపియన్ పెయింటింగ్‌లతో కూడిన గ్యాలరీలు, అరుదైన కళాఖండాలు మ్యూజియంలో సందర్శకులను మంత్ర ముగ్ధులను చేస్తున్నాయి.

హెచ్ఇహెచ్ నిజాం మ్యూజియం..

నిజాం వంశ పాలకుడైన ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ 1911లో రాజ్యాధికారం చేపట్టాడు. ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన ఆయన 1937లో తన పాతికేళ్ల పరిపాలన విజయవంతంగా పూర్తి చేసుకున్నాడు. దీంతో పాతికేళ్ల విజయోత్సవాలను ఘనంగా నిర్వహించారు. నిజాం రజతోత్సవ వేడుకలలో దేశ, విదేశాల నుంచి ఎందరో ప్రముఖులు హాజరై బహుమతులు అందజేశారు. ఈ బహుమతులన్నింటినీ ఒక దగ్గర చేర్చి ప్రజల సందర్శనార్థం పురానీహవేలీలో నిజాం మ్యూజియంను ఏర్పాటు చేశారు. బంగారంతో తయారు చేసిన సింహాసనం, వివిధ భవనాల నిర్మాణాల కోసం ఉపయోగించిన వెండి, బంగారంతో చేసిన గంపలు, తాపీలు, భవన నిర్మాణానికి ఉపయోగించే వివిధ పరికరాలు, దేశంలోనే తొలిసారి చేతితో నడిపిన లిఫ్ట్. ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీఖాన్ చెక్కతో తయారు చేయించిన ప్రపంచంలోకెల్లా అతిపెద్ద అల్మారా ఇక్కడ కొలువుదీరాయి.

యూరోపియన్ శైలిలో నిర్మించిన శ్వేతసాధం.. చౌమహల్లా ప్యాలెస్..



చార్మినార్ కట్టడం నుంచి వాకబుల్ డిస్టెన్స్‌లో ఉన్న ఈ చౌమహల్లా ప్యాలెస్ యూరోపియన్ శైలిలో నిర్మించిన శ్వేత సౌధం. ఇది నాలుగు ప్యాలెస్‌ల సముదాయం. ఏకాంతం (ఖిల్వత్)గా నిర్మించిన ఈ ప్యాలెస్‌లో పలు నిర్మాణాలు జరిగాయి. 5వ నిజాం అఫ్జల్–ఉద్–దౌలా–బహదూర్ పాలనా (1857–69) కాలంలో ఖిల్వత్ ప్యాలెస్‌లో నాలుగు ప్యాలెస్‌ల నిర్మాణం జరిగింది. టెహ్రాన్‌లోని షా ప్యాలెస్‌ను పోలిన ఆర్కిటెక్చర్‌లో ఐదో నిజాం అఫ్తాబ్ మహల్, మహ్తాబ్ మహల్, తహనియత్ మహల్, అఫ్జల్ మహల్‌ల నిర్మాణం జరిగింది. 1912లో ఏడో నిజాం ప్యాలెస్‌కు చేయించిన మరమ్మతులతో ప్యాలెస్ మరింత శోభాయమానంగా మారింది. అసఫ్ జాహీ పాలనలో యూరోపియన్ శైలిలో అత్యంత ఆకర్షణీయంగా పాలరాతి వలే నిర్మీతమైన చౌమహల్లా ప్యాలెస్ చార్మినార్ కట్టడానికి దగ్గరలో ఉంది. రెండు శతాబ్దాల క్రితం నిర్మించిన ఈ ప్యాలెస్ ప్రస్తుతం నిజాం ట్రస్ట్ ఆధ్వర్యంలో కొనసాగుతుంది.

సందడిగా సర్దార్ పటేల్ కళాశాల వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నరేందర్ సింగ్ పాల్, రాజేందర్, సురేందర్‌రెడ్డి

అబిడ్స్: సర్దార్ పటేల్ కళాశాల వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో వార్షికోత్సవ వేడుకలను కళాశాల పూర్వ విద్యార్థి, భారత హాకీ జట్టు మాజీ కోచ్ నరేందర్ సింగ్ పాల్, కళాశాల పాలకమండలి చైర్మన్ కె.రాజేందర్, కార్యదర్శి సురేందర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి నరేందర్‌సింగ్ పాల్ మాట్లాడుతూ.. విద్యార్థులను విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక, సామాజిక ఇతర రంగాల్లో ప్రావీణ్యం చెందే విధంగా తీర్చిదిద్దాలన్నారు. కళాశాల పాలకమండలి అధ్యక్షుడు కె.రాజేందర్, కార్యదర్శి సురేందర్ రెడ్డి మాట్లాడుతూ.. తమ కళాశాల విద్యార్థులు ప్రతి రంగంలో రాణించే విధంగా ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను బోధిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి గండ్ల విజయ్‌కుమార్, కోశాధికారి సూరజ్ సింగ్, ఉపాధ్యక్షులు కృష్ణ, ఓజీఏ అధ్యక్షుడు ప్రొఫెసర్ గోపాల్‌చారి, రాజశేఖర్, ప్రిన్సిపల్ డాక్టర్ హేమలత వైస్ ప్రిన్సిపల్ అమర్నాథ్ శర్మ, పరిపాలనాధికారి రాహుల్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన టోలిచౌకి మేరాజ్ కాలనీలోని కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి పేదలకు అండగా ఉంటూ వస్తున్నానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి అర్హులైన వారిచే దరఖాస్తు చేయిస్తున్నానన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో దళితబంధు పథకం ద్వారా వందలాది పేద కుటుంబాల వారికి లబ్ధిచేకూరందని, దీనివల్ల వారికి ఉపాధి కల్పించినట్లయిందన్నారు. మరోవైపు తాను మహిళ పొదుపు సంఘాల స్థాపనకు ప్రత్యేక చొరవ చూపిస్తున్నానన్నారు.

తెలంగాణ ఉద్యమాన్ని భావితరాలకు తెలపాలి



అబిడ్స్: తెలంగాణ చరిత్రను భావితరాలకు తెలిపే బాధ్యత పాలకులపై ఉందని ప్రముఖ జర్నలిస్టు కస్తూరి రాక సుధాకర్, లెఫ్టినెంట్ కల్నల్ తోకల శివానందరెడ్డి పేర్కొన్నారు. నిజాం విముక్త స్వాతంత్ర అమృతోత్సవాల వేడుకలు గోల్కొండ బాగా ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కస్తూరి రాక సుధాకర్, శివానందరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో సరస్వాన్ని త్యాగం చేసిన పలువురి త్యాగాలు నేటి పాఠ్యాంశాలలో లేవన్నారు. రామానందతీర్థను స్మరించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ యోధుడు సదాశివపేట్‌లో బసవ మానయ్యను ఎమ్మెల్యేగా ఓడించేందుకు స్వయంగా అప్పటి ప్రధాని నెహ్రూ రంగంలోకి దిగినా ఆయన గెలుపును ఆపలేకపోయారన్నారు. తెలంగాణ ఉద్యమంలో జైలులో హింసలను వందేమాతరంగా నినాదించిన రామ్‌చందర్‌రావు తర్వాత వందేమాతరం రామ్‌చందర్‌రావుగా మారారని తెలిపారు. సుబ్బారెడ్డి, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మి, సమితి అధ్యక్షులు సాంబిరెడ్డి, హిందువాహిని రాష్ట్ర నాయకురాలు మౌనిక పాల్గొన్నారు.

దళితబంధులో అవినీతిపై విచారణ జరిపించాలి



బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: సీఎం కేసీఆర్‌కు దళితులపై నిజంగా ప్రేమ ఉంటే అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేల వివరాలను బయటపెట్టాలని మహాజన సోషలిస్ట్ పార్టీ డిమాండ్ చేసింది. దళిత బంధులో జరిగిన అవినీతిని నిరసిస్తూ ఆదివారం బషీర్‌బాగ్ చౌరస్తాలోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోషలిస్ట్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. దళితబంధులో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేలపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై గవర్నర్ స్పందించాలని, సీఎం కేసీఆర్ మాటలను హైకోర్టు సుమోటాగా కేసు నమోదు చేయాలని కోరారు. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆందోళన చేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ప్రతినిధులను పోలీసులు అరెస్టు చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు.

ప్రబోధ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జ్ఞానేశ్వర్ గౌడ్, నరేష్‌గౌడ్ తదితరులు

జియాగూడ: 75 ఏళ్లుగా ప్రబోధ్ విద్యా సమితి ద్వారా విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తూ నూతనంగా ప్రబోధ్ హైస్కూల్ ఇంగ్లిష్ మీడియాన్ని ప్రారంభించిన సమితి ప్రధాన కార్యదర్శి వర్ద జ్ఞానేశ్వర్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం రహింపురా కాగజ్‌గూడలో ప్రబోధ్ విద్య సమితి ద్వారా నూతనంగా ఇంగ్లిష్ మీడియం స్కూల్‌ను ప్రారంభించారు. అంతకు ముందు నూతన పాఠశాల తరగతుల భవనంతో గణపతి పూజ, హోమం, సరస్వతి, నవగ్రహ పూజలను నిర్వహించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి తరగతి గదులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రబోధ్ విద్యాసమితి అధ్యక్షుడు జీఎస్ ప్రకాష్‌రావు, ఉపాధ్యక్షుడు గొడిశాల నరేష్‌గౌడ్, ప్యాట ప్రదీప్‌కుమార్, ప్రతాప్‌రెడ్డి, కోశాధికారి మోహన్‌గౌడ్, సభ్యులు మాడిశెట్టి సదానందం గుప్తా, గోవింద్ రావు, బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నూతన సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్‌కు బొకే అందిస్తున్న రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ మసీవుల్లా ఖాన్

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న సోఫి సామ్, కృష్ణంరాజు

అబిడ్స్: విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని ఇంటర్నేషనల్ బాస్కెట్‌బాల్ ప్లేయర్ సోఫి సామ్, ఇంటర్నేషనల్ వాలీబాల్ ప్లేయర్ కృష్ణంరాజు పేర్కొన్నారు. మెథడిస్ట్ కళాశాలలో జరిగిన మెథరిక్ ఉత్సవ్– 2023 ముగిపు వేడుకల్లో వారు పాల్గొని ప్రసంగించారు. మారుతున్న సాంకేతిక విప్లవంలో విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పెద్ద ఎత్తున రాణిస్తున్నారన్నారు . ప్రతి విద్యార్థికి క్రీడలు కూడా ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం మెథడిస్ట్ కళాశాలల కార్యదర్శి, చీఫ్, ప్యాట్రన్ కృష్ణారావు మాట్లాడుతూ.. తమ కళాశాలల్లో విద్యార్థులకు విద్యతో పాటు క్రీడారంగంలో కూడా ప్రావీణ్యం చెందే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం.లక్ష్మీపతిరావు, డాక్టర్ ప్రభుజీ బెనాకో, డాక్టర్ నాగేశ్వర్, సచ్చింద్రనాథ్, వినోద్ గుప్తా పాల్గొన్నారు.

ఈద్ మిలాప్



ఈద్ మిలాప్‌లో పాల్గొన్న ప్రతినిధులు

చాంద్రాయణగుట్ట: జమాతే ఇస్లామీ హిందూ చాంద్రాయణగుట్ట శాఖ ఆధ్వర్యంలో ఆదివారం బాబానగర్‌లోని రాడాన్ కన్వెన్షన్‌లో ఈద్ మిలాప్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. చాంద్రాయణగుట్ట దేవి ఆలయ నిర్వాహకులు ప్రమోద్‌కుమార్ కార్వాంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అన్వర్ ఉలూమ్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ అన్వర్ ఖాన్, బండ్లగూడ మండల డిప్యూటీ ఈవో ముఖరం అలీ, జమాతే ఇస్లామీ హిందూ చాంద్రాయణగుట్ట శాఖ అధ్యక్షుడు మహ్మద్ ఇసాక్, కనీ్వనర్ డాక్టర్ పహాదుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ నృత్య దినోత్సవం



చిన్నారులకు సర్టిఫికెట్లతో అభినందిస్తున్న దృశ్యం

సుల్తాన్‌బజార్: అంతర్జాతీయ నృత్య దినోత్సవం సందర్భంగా సిరాజ్ అండ్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణ సరస్వత పరిషత్ ఆడిటోరియంలో 200 మంది చిన్నారుల క్లాసికల్, వెస్ట్రన్ డ్యాన్స్‌లతో నృత్యాలు చేశారు. ముఖ్యఅతిథులుగా హాజరైన సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, తెలంగాణ ఫిల్మ్ చాంబర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ లయన్ వంశీప్రతాప్‌గౌడ్, శ్రీ వేద ది యూనివర్స్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీ శ్రీరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పిల్లలు నృత్యంతో పాటు చదవులోనూ ముందుండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నృత్య కళాకారులకు సర్టిఫికెట్లను అందజేసి సన్మానించారు. ఈ వేడుకలకు తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున చిన్నారి కళాకారులు తరలివచ్చి వారి నృత్య ప్రదర్శనను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో చిన్నారి కళాకారుల తల్లిదండ్రులకు సిరాజ్ మాస్టర్ ధన్యవాదాలు తెలిపారు.

గోల్కొండ కోట కిటకిట

గోల్కొండ: గోల్కొండ కోట ఆదివారం కిటకిటలాడింది. ఆదివారం సెలవు రోజుతో పాటు పాఠశాలలకు సెలవు కావడంతో పెద్ద ఎత్తున గోల్కొండ కోటకు పర్యాటకులు, విద్యార్థులు తరలి వచ్చారు. ఉదయం 7.30 గంటల నుంచే కోట బుకింగ్ కౌంటర్ ముందు పర్యాటకులు బారులుతీరారు. భారీ సంఖ్యలో పర్యాటకులు రావడంతో కోట సెక్యూరిటీ గార్డులు పర్యాటకులకు ప్రవేశద్వారం, బుకింగ్ కౌంటర్ వద్ద పర్యాటకులకు సహకరించారు. మరోవైపు గోల్కొండ కోట చౌరస్తా వద్ద ఉన్న గిఫ్ట్ అండ్ నావెల్టీస్ షాపులలో గిరాకీ బాగా జరిగింది.

ప్రతిఒక్కరూ భగవద్గీతను పఠించాలి



విద్యార్థులతో డాక్టర్ సంజయ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: సంస్కృత వేద శ్లోకాలతో కూడిన భగవద్గీతకు ఎవరి జీవితాన్ని అయినా మార్చే శక్తి ఉందని గీతా పరివార్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సంజయ్ మలాని అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో గీతా పరివార్ హైదరాబాద్ శాఖ ఆధ్వర్యంలో గీతా మైత్రి మిలన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. లోకమాన్య బాలగంగాధర్ తిలక్, మహాత్మాగాంధీలతో పాటు అనేక మంది విప్లవకారలు భగవద్గీత నుంచి ప్రేరణ పొందరని, వారందరూ కూడా గీతను నిజమైన మార్గదర్శిగా భావించారని తెలిపారు. భగవద్గీత మానవాళి ఉద్ధరణకు, లోక కల్యాణ్యానికి సంబంధించిన గ్రంథమని, ఈ గ్రంథాన్ని ప్రతి ఒక్కరూ పఠించాలని సూచించారు. ఆన్‌లైన్ వేదికగా లెర్న్ గీత అనే కార్యక్రమాన్ని ప్రారంభించామని ఈ వేదికను ఉపయోగించుకోవచ్చాను. అనంతరం భగవద్గీతను పఠించడంతో పా టు సమాజానికి ఆ సారాంశాన్ని చేరవేస్తున్న విద్యార్థులకు ప్రశంసాపత్రాన్ని అందజేసి అభినందించారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



మజ్లిస్ నాయకులతో కార్పొరేటర్ నసీరుద్దీన్

గోల్కొండ: మజ్లిస్ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్ అన్నారు. ఆదివారం పలువురు మజ్లిస్ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నానల్‌నగర్ డివిజన్‌కు చెందిన మజ్లిస్ ఏరియా కమిటీలు పటిష్టంగా ఉండి పని చేస్తున్నాయన్నారు. కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ సాకారాలతో డివిజన్‌లో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు జరిగాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు సయ్యద్ రఫత్ హుస్సేన్, మజీద్, జబ్బార్ తదితరులున్నారు.

దోమల నివారణకు చర్యలు

గోల్కొండ: దోమల నివారణకు మందును స్ప్రే చేస్తున్నామని గోల్కొండ డివిజన్ మలేరియా సూపర్‌వైజర్ మహ్మద్ అన్నారు. శనివారం ఉదయం ఆయన బల్దియా వార్డు కార్యాలయంలో బల్దియా సిబ్బంది దిశానిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా గోల్కొండ కోట కందకాలతో పాటు చెత్తకుండి పరిసరాల్లో మందును స్ప్రే చేయాలని ఆయన అన్నారు. అదే విధంగా ఇంటింటికీ తిరిగి ముఖ్యంగా ఇళ్లలోని వాటర్ ట్యాంకులు, టాయిలెట్ల వద్ద మందును స్ప్రే చేయాలన్నారు.

స్వీయ రక్షణకు కరాటే దోహదం



కరాటే విన్యాసాలు చేస్తున్న విద్యార్థినులు

చాంద్రాయణగుట్ట: ఆత్మరక్షణకు ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలని ఛత్రినాక లక్ష్మణేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ అన్నారావు కులకర్ణి అన్నారు. నాయక్ బూడోఖాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఆలయ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌ను ఆదివారం ఆయన అకాడమీ అధ్యక్షుడు గణేష్ నాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అన్నారావు మాట్లాడుతూ.. పేద పిల్లల కోసం నాయక్ బూడోఖాన్ కరాటే అకాడమీ తరఫున ఉచితంగా శిక్షణ ఇస్తుండడం అభినందనీయమన్నారు. ఇలాంటి సదావకాశాన్ని చిన్నారులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు మారెడ్డి దామోదర్ రెడ్డి, కరాటే మాస్టర్లు పి.రాహుల్, ఎం.వాసుదేవ్, ప్రకాష్ నాయక్, ఉదయ్, తనీషా రెడ్డి, అఖిల తదితరులు పాల్గొన్నారు.

'మన్ కీ బాత్' వీక్షణ



మన్ కీ బాత్ కార్యక్రమాన్ని తిలకిస్తున్న నాదెండ్ల భాస్కర్ రావు, నాగేందర్‌రెడ్డి తదితరులు

చార్మినార్: ప్రధాని నరేంద్ర మోదీ 100వ ఎపిసోడ్ 'మన్ కీ బాత్' కార్యక్రమం ఆదివారం సాలార్‌జంగ్ మ్యూజియంలో జరిగింది. బీజేపీ మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం మన్ కీ బాత్ కార్యక్రమాన్ని తిలకించారు. ఆయనతో పాటు సాలార్‌జంగ్ మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ ఎ.నాగేందర్‌రెడ్డి, ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ సుధారాణి, డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ అంజుమ్ ఉన్నీసా, డాక్టర్ నైనా జైస్వాల్ పాల్గొన్నారు. క్రిస్టియన్, జైన్, సిక్, షియా కమ్యూనిటీలకు చెందిన ప్రతినిధులకు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ మన్ కీ బాత్ అవార్డులను అందజేసి సత్కరించారు.

మన్ కి బాత్‌కి విశేష స్పందన..

గోల్కొండ: మోదీ 'మన్‌కీ బాత్'కి విశేష స్పందన వచ్చిందని బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ టి.అమర్ సింగ్ అన్నారు. ఆదివారం జరిగిన మోదీ మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్ గుడిమల్కాపూర్‌లోని బీజేపీ కార్యాలయంలో వీక్షించారు. కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాలలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా వీక్షించారు.

గోషామహల్‌లో..

అబిడ్స్: మన్ కీ బాత్‌లో గోల్కొండ జిల్లా బీజేపీ కిసాన్‌మోర్చా నాయకులు పాల్గొన్నారు. ప్రధాని మోదీ ఆల్ ఇండియా స్థాయిలో ఆదివారం మన్ కీ బాత్ కార్యక్రమం నిర్వహించారు. గోషామహల్‌లో గోల్కొండ జిల్లా బీజేపీ కిసాన్‌మోర్చా అధ్యక్షుడు మానిక్‌ప్రభు, ప్రధాన కార్యదర్శి కృష్ణాగుప్తా, అధికార ప్రతినిధి, శశికాంత్ కులకర్ణి పాల్గొన్నారు.



'మన్ కీ బాత్'ను వీక్షిస్తున్న కార్వాన్ బీజేపీ ఇన్‌చార్జి అమర్‌సింగ్



మన్ కీ బాత్‌ను వీక్షిస్తున్న మాణిక్ ప్రభు, కృష్ణాగుప్తా, శశికాంత్ కులకర్ణి